నియామక పత్రాల అందజేత


నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎంఈవో

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2008 అభ్యర్థులకు సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం సోమవారం విద్యాశాఖ అధికారులు నియామక ఉత్తర్వులను అభ్యర్థులకు అందజేశారు. కాగజ్‌నగర్ పరిధిలో ఇద్దరికి అవకాశాలు రావటంతో సోమవారం విధుల్లో చేరేట్టు ఎంఈఓ చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్సీ-2008 రాసిన అభ్యర్థులు మాట్లాడుతూ గత 17 సంవత్సరాలు పోస్టింగ్‌ల కోసం నిరీక్షిస్తున్నామని, తమకు ఇప్పుడు ఉద్యోగం రావటం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

కౌటాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలెపల్లి గ్రామంలో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం క్రికెట్ టోర్నమెంట్‌ను నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మధుకర్, వసంత్‌రావు, కుషబ్‌రావు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


కాగజ్‌నగర్ పట్టణంలోని తపాలా కార్యాలయం

ఆందోళనలో పోస్టల్ ఉద్యోగులు

- ఇంటిగ్రేటెడ్ డెలివరీ సెంటర్ల ఏర్పాటుతో ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి పంపిణీ వ్యవస్థ
- ఉద్యోగ భద్రత కరువైందని ఆవేదన
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆధ్వ ర్యంలో కొనసాగుతున్న తపాలా (పోస్టల్) శాఖలో తెస్తున్న సంస్కరణలు, పెండింగ్ సమస్యలు పరిష్కారం కాక భవిష్యత్తుపై ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. నూతన విధానాల సంస్కరణలతో తపాలా వ్యవస్థ నిర్వీర్యమవయ్యే అవకాశాలున్నాయని ఉద్యోగ సంఘాలు ఆవేదన చెందుతున్నాయి. ఇంటిగ్రేటెడ్ డెలివరీ సెంటర్ల ఏర్పాటు చేస్తే తమ పరిస్థితి ఏంటీ? తమ భవిష్యత్తుకు భరోసా ఉండదనే అనుమానాలు వారిలో ఏర్పడుతున్నాయి. ఈ సెంటర్లను ప్రస్తుతం ప్రధాన పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వివిధ వస్తువులను ఈ-కామర్స్ సెంటర్ల ద్వారా పంపిణీ చేస్తున్నారు. అదే తరహాలో తపాలా శాఖకు సంబంధించిన వస్తువుల పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తుల చేతిల్లోకి సంస్థ కార్యక్రమాలు పోతే తమకు భవిష్యత్ ఉండదని ఆవేదన చెందుతున్నారు. వీటితో పాటు మెకనైజ్డ్ డెలివరీ సిస్టం ద్వారా పోస్టల్ ఉద్యోగులకు భద్రత లేకుండా పోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు వెంటనే పాత పెన్షన్ విధానం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విధానం తమకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని పలువురు సిబ్బంది పేర్కొంటున్నారు. కొత్త పెన్షన్ విధానం వల్ల తమ జీతాల్లోంచి 33 శాతం పీఎఫ్ శాఖకు కట్టాల్సి ఉంటుందని పలువురు తెలిపారు. వీటితో పాటు పెండింగ్‌లో ఉన్న గ్రామీణ డాక్ సేవకులను తీసుకొని సివిల్ సర్వెంట్ హోదా కల్పించటంతో పాటు పెన్షన్, మెడికల్, బెనిఫిట్ సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

● జిల్లాలో 20 పోస్టాఫీసులు..:

కుమురం భీం జిల్లాలో 20 తపాలా శాఖలు సేవలు అందిస్తున్నాయి. ప్రస్తుతం వంద మంది కిపైగా సిబ్బంది పనిచేస్తున్నారు. నూతన మార్పులు వస్తుండటంతో వీరి భవిష్యత్తుపై నీలినీడలు పడుతుంటంతో అంతా ఆందోళనకు గురవుతున్నారు. నూతన విధానంలో కొత్త ఒరవడిని అవలంబించి ఇంటిగ్రేటెడ్ డెలివరీ సెంటర్ల ఏర్పాటు చేస్తే తమ ఉద్యోగాలకు భద్రత ఉండదని ఆవేదన చెందుతున్నారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించి తమకు ఉద్యోగ భద్రత కల్పించేట్టు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పోస్టల్ శాఖలో సంస్కరణలతో తమకు ముప్పు ఉందని తమకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని, దశల వారీగా పోరాటం చేస్తామని జేఏసీ సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటం

- పి సంతోష్ కుమార్, జేఏసీ కన్వీనర్

తపాలా శాఖలో పెండింగ్ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. పాత పెన్షన్ విధానం ఇంత వరకు అమలు కావటం లేదు. దీంతో ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఇంటిగ్రేటెడ్ డెలివరీ సెంటర్లపై కూడా స్పష్టత లేదు. స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. ఉద్యోగులకు అన్యాయం చేస్తే ఆందోళనలు తీవ్రతరం చేస్తాం.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బెజ్జూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో మంగళవారం మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ అంజల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 132 కేవీ లైన్ నిర్మాణంలో భాగంగా 33కేవీ రవీంద్రనగర్, 11కేవీ అనుకోడ, 11 కేవీ చీపుదుబ్బ ఫీడర్లలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. దీంతో కోయయాపల్‌గూడ, యాపల్‌గూడ, నాగెపల్లి, గురుడుపేట, కస్నెపల్లి, కనికి, దంపల్లి, రవీంద్రనగర్, బాబాపూర్, గంగాపూర్, బాబాసాగర్, చింతలమానేపల్లి, రుద్రాపూర్, కర్జవెల్లి ముంజంపల్లి, బారెగూడ, పోతెపల్లి, కాటేపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

- అదనపు కలెక్టర్ డేవిడ్



ఆసిఫాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రేషన్‌బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ డేవిడ్ హెచ్చరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి పౌర సరఫరాల ఉప తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపంపిణీ వ్యవస్థ కార్యకలాపాలను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. రేషన్ డీలర్లు ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, పీడీఎస్ బియ్యం అక్రమంగా కొనడం, అమ్మడం చేసిన వారిపై పీడీఎస్ కంట్రోల్ ఆర్డర్ 2016 ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యాన్ని అవసరాల కోసం వినియోగించాలని విక్రయించకూడ దని తెలిపారు. ఎవరైనా పీడీఎస్ బియ్యం అక్రమంగా కొనుగోలు, విక్రయిచినట్లు గుర్తిస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, వారి రేషన్ కార్డు తొలగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వేలం ప్రక్రియ పూర్తి

రెబ్బెన, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంబా గ్రామంలోగల ప్రసన్న పరమేశ్వరాలయంలో ఈ నెల 25, 26, 27 తేదిల్లో జరిగే జాతరకు వేలం ప్రక్రియను సోమవారం పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ చైర్మన్ ఆడె వేణు ఒక ప్రకటనలో తెలిపారు. లడ్డు ప్రసాదం రూ.60,016, కొబ్బరికాయలు రూ.50,016, తైబజారు రూ.1,03,016, సైకిల్ స్టాండు రూ 1,06,016, సంవత్సరం దుకాణం రూ.57016 వేలంలో ఆదాయం వచ్చినట్టు తెలిపారు. మొత్తం ఆదాయం రూ.3,76,016 ఆలయానికి సమకూరినట్టు వివరించారు.

ఉపాధి హామీ పనులు తనిఖీ


ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి

జైనూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను జైనూర్ ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు పనుల్లో నష్టం జరగకుండా కొలతల ప్రకారం పనులు నిర్వహించాలని సూచించారు. ఆదేవిధంగా కొత్త పనులు వచ్చే ఏప్రీల్ మాసం నుండి ప్రారంభం కాబోతున్నాయని పని దినాలు మిగిలి ఉన్న కూలీలు చురుకుగా పనులు చేసి వంద రోజులు పూర్తి చేయాలని కోరారు. ఆదే విధంగా వేసవి కాలం ప్రారంభమైనందున కూలీలు ఉదయాన్నే పనికి వెళ్ళి మధ్యాహ్నం కల్ల తిరిగి ఇంటికి చేరుకోవాలని ఎంపీడీవో కారారు. ఈ సందర్భంగా ఏపీఓ నగేష్, టెక్నీకల్ అసిస్టెంటు గులాబ్ సింగ్, ఫీల్డ్ అసిస్టెంటు ఉత్తం రవిందర్, ఆనంద్‌రావ్, భరత్ తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు చేయడం నేరం

- జిల్లా బాలల సంరక్షణాధికారి మహేష్


కౌన్సెలింగ్‌లో మాట్లాడుతున్న డీసీపీవో మహేష్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను చేయడం చట్టరీత్యా నేరమని అందుకు రెండు సంవత్సరాల శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధించడం జరుగుతుందని జిల్లా బాలల సంవరక్షణ అధికారి మహేష్ అన్నారు. రెబ్బెన మండలం వంకులం గ్రామానికి చెందిన మైనర్ అమ్మాయిని జిల్లా కేంద్రంలోని రాజంపేటకు చెందిన అబ్బాయితో ఆదివారం వివాహం జరగాల్సిన ఉండగా 1098 టోల్‌ఫ్రీ నంబరుకు అందిన సమాచారం వచ్చిన మేరకు బాల రక్షణ భవన్ సిబ్బంది వెళ్లి వాహనాన్ని అడ్డుకున్నారన్నారు. వివాహం జరగాల్సిన మైనర్ బాలికను ఆసిఫాబాద్ సఖి కేంద్రానికి తరలించి ఇరు కుటుంబసభ్యులకు, కుల పెద్దలను పిలిపించి సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం బాల్య వివాహాల ద్వారా ఎదురయ్యే ఆరోగ్య, మానసిక సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా డీసీపీవో మాట్లాడుతూ చిన్న వయస్సులో ఆడ పిల్లలకు పెళ్ళిళ్ల చేసి వారి బంగారు భవిష్యత్‌ను పాడు చేయవద్దని సూచించారు. ప్రభుత్వం బాలికల విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు.

ఆడ పిల్లలను చదివించి 18 సంవత్సరాల వయస్సు నిండిన తరువాతనే వివాహాలు చేయాలని సూచించారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్ చంద్రశేఖర్, రవళి, జమున, మమత, సుమలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దృష్టి లోప నివారణకే కంటి పరీక్షలు

- జిల్లా వైద్యాధికారి సీతారాం


విద్యార్థినికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దృష్టి లోప నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కంటి పరీక్షలు నిర్వహిస్తోందని జిల్లా వైద్యాధికారి సీతారాం తెలిపారు. విద్యార్థుల్లో దృష్టి లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యార్థులకు నేత్ర వైద్య నిపుణులు విశాల కంటి పరీక్షలు నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి సీతారాం మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ గతేడాది రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం(ఆర్బీఎస్‌కె) కింద రెండు విడతలు రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల్లో శిబిరాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. కంటి పరీక్షల శిబిరాలు పది రోజుల పాటు కొనసాగుతాయని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 931 మంది విద్యార్థులకు కంటి చూపులో ఇబ్బందులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీరందరికి కంటి పరీక్షల అనంతరం అద్దాల పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కె నోడల్ అధికారి నేంద్ర, ఆప్తోమెట్రిస్ట్ జగన్‌మోహన్, దినేష్ పాల్గొన్నారు.

‘వివేకానంద’లో వీడ్కోలు హంగామా



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని వివేకనంద జూనియర్ కళాశాలలో సోమవారం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ హనుక్ మాట్లాడుతూ వార్షిక పరీక్షలు సమీపిస్తుండటంతో సమయాన్ని సద్వినియోగం చేసుకొని చక్కటి ఫలితాలు సాధించాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ కోర్సుల్లో చక్కటి మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగింపు


జూబ్లీ మార్కెట్‌లో చెత్త తొలగిస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా పట్టణంలోని రాజంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని జూబ్లీ మార్కెట్‌లో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని, కూరగాయల వ్యర్థాలను గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రైవేటు కార్మికులను ఏర్పాటు చేసి సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట గ్రామపంచాయతీకి పారిశుధ్య కార్మికులను, ట్రాక్టర్‌ను ప్రభుత్వం కేటాయించలేదని ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదించడం జరిగిందన్నారు. కూరగాయల మార్కెట్‌లో పేరుకు పోయిన చెత్త చేదారాన్ని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రైవేటు కార్మికులతో తొలగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది సంతోష్ తదితరులు ఉన్నారు.

బాధితులకు అండగా భరోసా కేంద్రం


కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ కరుణాకర్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రం బాధిత మహిళలకు, పిల్లలకు అండగా నిలుస్తున్నారని డీసీఆర్బీ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. ఈ సందర్భంగా భరోసా కేంద్రం ప్రారంభించి సోమవారం నాటికి సంవత్సరం పూర్తి కాగా వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రియ రవీందర్, డీసీపీఓ మహేష్, భరోసా ఎస్సై తిరుమల, లీగల్ అడ్వైజర్ శైలజ, విజయలక్ష్మి, రిసెప్షనిష్టు సుమలత, డీసీబీవో, సఖీ సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం


శ్రీశైలంను సన్మానిస్తున్న బండి సంజయ్

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన దోని శ్రీశైలంను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సన్మానించారు. ఇటీవల జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీశైలం మొదటిసారిగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని హైదరాబాద్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనను బండి సంజయ్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను అభినందించి జిల్లాలో పార్టీ శ్రేణులను అందరినీ కలుపుకొనిపోయి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు.

మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు



ఆసిఫాబాద్‌లో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కాగజ్‌నగర్‌లో వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం కుమరం భీం జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పెన్నులు, నోట్ బుక్కులు అందజేశారు. అనంతరం మొక్కలు నాటారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి హాజరై మాట్లాడారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో అన్నివర్గాల వారు అభివృద్ధి చెందారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు సాయినాథ్, నాయకులు అలీబిన్ అహ్మద్, సంజీవ్, రవీందర్, నిసార్, జీవన్, శ్రీధర్‌రెడ్డి, అహ్మద్, అశోక్, భీమేష్, సృజన, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో జరిగిన వేడుకల్లో బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో మాజీ జడ్పీటీసీ అజయ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అయూబ్, ప్రవీణ్, వినోద్, అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో నాయకులు సారయ్య, దేవయ్య, మైనోద్దీన్, తిరుపతి, ఇస్తారి, ఫసి, సిరాజ్‌ఖాన్, మోహన్ పాల్గొన్నారు.

పెంచికలపేట (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు మహేష్, దేవాజీ, సతీష్, గోపాల్, యాదవ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో నాయకులు యూనుస్, రాజయ్య, ఇఫ్తెకార్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉషేగాం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఆత్రం శంకర్, మాజీ సర్పంచ్ మడావి భీంరావ్, మాజీ ఎంపీటీసీ కుంర భగ్వంత్‌రావ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గేడాం లక్ష్మణ్, ముడె సతీష్ పాల్గొన్నారు.

సిర్పూర్(యు) (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోసడం ధర్మారావు, నాయకులు మడావి బోజ్జీరావు, కోవ నాందేవ్, తోడసం తిర్మన్‌రావు,మెస్రం నరేష్, పెందోర్ అర్జున్, తోడసం గుణవంత్‌రావు, కుమ్ర యశ్వంత్‌రావు, రమేష్, గెడం యశ్వంత్‌రావు, ఆత్రం గణపతి పాల్గొన్నారు.

రెబ్బెన (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్‌చైర్మన్ రంగు మహేష్, మాజీ ఎంపీపీ సౌందర్య, కె శంకరమ్మ, సంఘం శ్రీనివాస్, పోతిరెడ్డి, బి శ్రీధర్, మధునయ్య తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల వెంటనే అమలు చేయాలని కోరుతూ సోమవారం సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు చలో హైదరాబాద్ పోస్టర్లను పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసి జిల్లా కార్యదర్శి ఎండీ చాంద్‌పాషా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత వరకు ఆరు గ్యారంటీలను అమలు పర్చటం లేదన్నారు.

హామీలను వెంటనే అమలుపర్చాలని సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో ఈ నెల 20 చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా కన్వీనర్ రత్నం పోశన్న, ఆత్రం రాజన్న, ప్రవీణ్ పోశయ్య, నాని, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

మండల సమగ్రాభివృద్ధికి కృషి

ఎంపీడీవో సుధాకర్ రెడ్డి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: మారుమూల గ్రామాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేమిటి

ఎంపీడీవో: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మారుమూల గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నాం. సమస్యలు పరిష్కరించేందుకు గ్రామ కార్యదర్శులను అప్రమత్తం చేశాం. మండల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: అర్హులైన వారికి పింఛన్లు రావడం లేదని వస్తున్న విమర్శలపై ఏమటాంటారు?

ఎంపీడీవో: గ్రామాల్లో అర్హులైన వారికి పింఛన్లు ఇస్తున్నాం. కొత్తగా దరఖాస్తు చసుకున్న వారికి పింఛన్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: ఉపాధి పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు?

ఎంపీడీవో: గ్రామాల్లో ఇది వరకే ఉపాధి పనులు ప్రారంభించాం. కూలీలు ఉదయా న్నే పనికి వెళ్లి వస్తున్నారు. వచ్చే ఏప్రిల్ నుండి కొత్త పనులు ప్రారంభిస్తాం

ఆంధ్రజ్యోతి: ప్రజా పాలనలో ఎంత మందికి ఇందిరమ్మ గృహాలు మంజూరు అయ్యాయి?

ఎంపీడీవో: మండలంలోని మార్లావాయి లో స్థలం ఉన్న 52 మందికి ఇందిరమ్మ గృహాలు మంజూరు అయ్యాయి. స్థలం లేని మిగితా 19 మంది లబ్ధిదారులకు సైతం ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసింది.

- జైనూర్ (ఆంధ్రజ్యోతి)



మూతపడ్డ సీఎఫ్‌సీ

- ప్రభుత్వ ఆర్డర్లు లేక కార్మికులకు ఉపాధి కరువు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- ఆందోళనలో కార్మికులు

వాంకిడి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న మండల కేంద్రంలోని కామన్ ఫెసిలిటి సెంటర్ (సీఎఫ్‌సీ) ప్రభుత్వ ఆర్డర్లు లేక ముతపడింది. దీంతో పనులు జరగక కార్మికులకు ఉపాధి కరువైంది. గతంలో 60 మందికి పైగా కార్మికులకు ఉపాధి అందించిన ఈ పరిశ్రమ నేడు పనులులేక ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ పరిశ్రమపైనే ఆధారపడ్డ కార్మికులు ఉపాధి దొరకక వీధిన పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు పనులతో కళకళలాడిన పరిశ్రమ నేడు ప్రభుత్వ ఆర్డర్లు లేక వెలవెలబోతోంది. గతేడాది డిసెంబరు వరకు కార్మికులు పనులు కొనసాగగా అప్పటి నుంచి ఎలాంటి ప్రభుత్వ ఆర్డర్లు రాక కార్మికులకు పనులు లేక ఇబ్బందులు తప్పడం లేదు.

సీఎఫ్‌సీ ప్రస్థానం..

1971లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు హాయంలో రాష్ట్రంలో 56 సీఎఫ్‌సీ (కామన్ ఫెసిలిటీ సెంటర్) కేంద్రాలను ప్రారంభించారు. అందులో భాగంగానే అప్పటి తాలుకా కేంద్రమైన వాంకిడిలో తొమ్మిది వేల రూపాయలతో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని కేంద్రాలు మూతపడగా ఆదరణ పొందిన ఈ సంస్థ మాత్రమే ఉనికిని చాటుకుని నడుస్తోంది.

1980లో ఈ సంస్థను ఐటీడీఏ ఆధీనంలో తీసుకుని నిరుద్యోగ గిరిజన యువతకు కర్రతో ఫర్నిచర్ తయారీలో శిక్షణ ఇవ్వడం ప్రారంభించింది. యువతకు శిక్షణతో పాటు ఉపాధి అవకాశం కల్పించాన్న ఉద్దేశంతో 1987-88లో ఐటీడీఏ ఆధ్వర్యంలో కార్మికుల సౌకర్యార్థం షెడ్లు, భవనాలు నిర్మించి ఫర్నీచర్ తయారీకి అవసరమైన పరికారులనను సమకూర్చి ఆధునీకరణ చేశారు. 1991 నాటికి 335 మందికి వృత్తి శిక్షణ ఇచ్చారు.

కాలక్రమేణ కలప కొరత ఏర్పడడంతో 1998-99లో మెటల్ వర్క్స్‌తో తయారు చేయడం ప్రారంభించారు. సీఎఫ్‌సీ పనితనాన్ని గుర్తించిన అప్పటి కలెక్టర్ సుకుమార్ ఈ సంస్థ అభివృద్ధికి 14 లక్షల రూపాయలను మంజూరు చేశారు. అనంతరం కొంత మంది అప్పటి ఐటీడీఏ అధికారులు ఆర్థిక సహాయం అందించడంతో ఆధునిక యంత్రాలను సమకూర్చి వస్తువులను తయారు చేశారు.

ఫర్నీచర్ తయారీలో కార్మికులు దిట్ట..

కలపతో అందమైన వస్తువులు తయారు చేయడంలో ఇక్కడి కార్మికుల ప్రతిభ అమోఘం. భవనాలకు అమర్చే తలుపులు, కిటికీలు, టేబుల్లు, సోఫాసెట్‌లు, రాకింగ్‌చైర్లు, డైనింగ్ టేబుల్, డ్రెస్సింగ్ టేబుల్, తదితర వస్తువులు తయారు చేస్తారు. వాటి రూపకల్పనలో కార్మికులు తమ ప్రత్యేకతను ప్రదర్శిస్తారు. కలపతో పర్నీచరే కాకుండా ఇనుముతో బీరువాలు, బెడ్‌లు, డ్యూయల్ డెస్కులు తదితర వస్తువులు తయారుచేస్తుంటారు. ప్రస్తుతం కలప దొరకకపోతుండడంతో ఇనుముతోనే వస్తువులను తయారు చేస్తున్నారు.

2012లో పనులు లేక ఈ పరిశ్రమ సంక్షభంలో చిక్కుకుంది. అప్పటి నుంచి జూలై 2015 వరకు పరిశ్రమ మూతపడింది. దీంతో పరిశ్రమపై ఆధారపడ్డ కార్మికుల ఉపాధిని కోల్పోవల్సి వచ్చింది. అనంతరం అప్పటి ఐటీడీఏ పీవో ఆర్‌వీ కర్ణన్ సీఎఫ్‌సీని సందర్శించి పరిశ్రమను పునరుద్ధరించే దిశగా చర్యలు తీసుకున్నారు. ఆరు లక్షల రూపాయల కార్పస్ నిధులను మంజూరు చేసి తిరిగి సీఎఫ్‌సీని పునర్ ప్రారంభించారు. తరువాత ప్రభుత్వ ఆర్డర్లు లేకపోవడంతో తిరిగి పరిశ్రమ మూతపడింది.

ప్రభుత్వ ఆర్డర్లు లేక కరువైన ఉపాధి...

గత ఏడాది అప్పటి కలెక్టర్ రాహుల్‌రాజ్ రూ. 4.50 లక్షల బెంచీలు తయారు చేసేందుకు ఆర్డర్ ఇవ్వడంతో కొన్ని నెలల పాటు పరిశ్రమ కొనసాగింది. తరువాత ఆర్డర్లు లేక తిరిగి మూతపడింది. ఒకప్పుడు పనులతో కళకళలాడిన పరిశ్రమ నేడు ప్రభుత్వ ఆర్డర్లు లేక వెలవెలబోతుంది. గతేడాది పరిశ్రమ మూతపడి ఉండగా అప్పటి ఐటీడీఏ పీగా పనిచేసిన వరుణ్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్‌గా పనిచేసిన చాహత్‌బాజ్‌పాయ్ సీఎఫ్‌సీ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకొని మూడు లక్షల రూపాయలు విలువ చేసే కలప తయారీకి ఆర్డర్ ఇవ్వడంతో పరిశ్రమ తిరిగి తెరుచు కుంది. అనంతరం బెంగుళూరుకు చెందిన బెల్ (భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్) కంపెనీ నుంచి రూ. 34 లక్షల విలువ చేసే 500 డ్యూయల్ డెస్కులు ఆర్డర్ రావడంతో తిరిగి పరిశ్రమ గాడిన పడింది. అనంతరం చిన్న చిన్న ఆర్డర్లు రావడంతో గతేడాది అక్టోబరు వరకు పనులు కొన సాగాయి. ప్రస్తుతం ఆర్డర్లు లేకపోవడంతో గతేడాది నుంచి కార్మికులు పనులులేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ప్రభుత్వం ఆర్డర్లు ఇచ్చినట్లైతే సీఎఫ్‌సీకి పూర్వ వైభం రానుంది.



ప్రభుత్వ ఆర్డర్లు రావడంలేదు...
మడావి పైకాజీ, పర్యవేక్షకుడు

సీఎఫ్‌సీకి ప్రభుత్వ ఆర్డర్లు రాకపోవడంతో ఉపాధి తగ్గింది. గతంలో ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఫర్నీచర్ ఆర్డర్లు వచ్చేవి. దీంతో 60 మంది కార్మికులకు ఉపాధి కలిగేది. గతేడాది వరకు అధికారులు ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వడంతో పనులు సాగాయి. ప్రస్తుతం ఆర్డర్లు లేకపోవడంతో పనులులేక మూతపడింది. సీఎఫ్‌సీకి ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని ఉన్నతాధికారులకు విజ్ఞాప్తులు చేస్తున్నాము.



ప్రత్యేక దృష్టి సారించాలి
: విశ్వేశ్వర్, కార్మికుడు

పరిశ్రమ ప్రధానంగా ప్రభుత్వ ఆర్డర్లపై ఆధారపడి కొనసాగుతుంది. ఆర్డర్లు ఉన్న సమయాల్లో కార్మికులకు ఉపాధి దొరుకుతూ పనులు లేని సమయంలో కార్మికులకు ఉపాధి ఉండడంలేదు. ఈ పరిశ్రమపై ఆధారపడి ఉన్న తమకు ప్రస్తుతం పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాము. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ ఆర్డర్లు అందించి కార్మికులను ఆదుకోవాలి.

తాండూర్ మండలాన్ని వదిలిన పులి

తాండూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నాలుగైదు రోజుల నుంచి తాండూర్ మండలంలోని గోపాల్‌నగర్, గోపాల్‌రావుపేట, అచ్చలాపూర్ గ్రామాల శివార్లలో సంచరించిన పులి సోమవారం మధ్యాహ్నం చర్లపల్లి బీట్ నుంచి నెన్నెల మండలం బొప్పారం నర్సరీ దాటి వెళ్లినట్లు అటవీ శాఖ తెలిపారు. అటవీ శాఖ అధికారులు ఇచ్చిన సమాచారంతో స్థానికులు ఊరిపి పీల్చుకున్నారు.

గీత కార్మికుడికి గాయాలు



చెట్టు పైనుంచి పడిన సత్యాగౌడ్

జైపూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన గడ్డం సత్యాగౌడ్ అనే గీత కార్మికుడు చెట్టు పైనుంచి పడడంతో తీవ్ర గాయాలైనట్లు స్థానికులు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కి కల్లు తీసే క్రమంలో మోకు జారి ప్రమాదవశాత్తూ కింద పడడంతో తీవ్ర గాయాలైనట్లు పేర్కొన్నారు. పక్కనే పొలంలో పనిచేస్తున్న గ్రామస్థులు 108కు సమాచారం అందించడంతో అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కార్మికునికి చేయి పూర్తిగా విరిగిందని, నడుం భాగంలో బలమైన గాయాలయ్యాయని, చేతికి ఆపరేషన్ అవసరమని పేర్కొన్నారని తెలిపారు.

బ్రూనో వర్ధంతి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇటాలియన్ తత్వవేత్త బ్రూనో వర్ధంతిని సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో డీహెచ్‌పీఎస్ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, లక్ష్మణ్, సత్యనారాయణ, రాజు, సురేష్, శ్రీధర్, రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి

-కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కమార్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కమార్ అన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలోని బీజేపీ మండల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా నియామకమైన బీజేపీ మండలాధ్యక్షులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చూపించాలన్నారు. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు గెలవడం ఖాయమన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పక్షాన పోరాటం చేసిన పార్టీగా ఒక్క బీజేపీకే ఓట్లు అడిగె హక్కు ఉందన్నారు. మేధావులు ఆలోచించి బీజేపీని ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీలు రఘునందన్‌రావు, జి నగేష్, ఎమ్మెల్యేలు కాటేపల్లి వెంకటరమణారెడ్డి, పాయల శంకర్, పాల్వాయి హరీష్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, చింతల రాంచంద్రారెడ్డి, బొడిగె శోభ, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్లు సునీల్‌రావు, డి.శంకర్, ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో విద్యార్థిపై సహచరుల దాడి

- అలస్యంగా వెలుగులోకి..
- ఏడుగురు విద్యార్థుల సస్పెన్షన్

చెన్నూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థి మనోజ్‌గౌడ్‌పై అదే పాఠశాలలో చదువుతున్న ఏడుగురు విద్యార్థులు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో బాధిత విద్యార్థి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం గురుకుల పాఠశాల ఎదుట ఆందోళన చేయడంతో ఏడుగురు విద్యార్థులను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. బాధిత విద్యార్థి మనోజ్‌గౌడ్ తండ్రి రాజేందర్‌గౌడ్ కథనం ప్రకారం.. మనోజ్‌గౌడ్ పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు. ఈ నెల 6న రాత్రి అదే తరగతికి చెందిన ఏడుగురు మనోజ్‌గౌడ్‌పై దాడిచేసి ఆ దృశ్యాలను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. విషయం బయటకొస్తే చంపేస్తామని మనోజ్‌గౌడ్‌ను బెదిరించడంతో భయంతో చెప్పకుండా ఉండిపోయాడు. దాడి విషయాన్ని ఆదివారం మనోజ్ మిత్రుడు ఫోన్ ద్వారా తన తండ్రికి సమాచారం అందించి, ఆ వీడియో దృశ్యాలను సెల్‌ఫోన్‌కు పంపించాడు. ఈ ఘటనపై సోమవారం గురుకులానికి వెళ్లి ప్రిన్సిపాల్, వార్డెన్‌లను సంప్రదించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘ నాయకులు గురుకులం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ప్రిన్సిపాల్, వార్డెన్‌లతో పాటు దాడికి పాల్పడిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో స్పందించిన ప్రిన్సిపాల్ కేవీఎం ప్రకాష్ గురుకులంలో జరిగిన ఘటనపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించడంతో వారి ఆదేశాల మేరకు దాడి చేసిన ఏడుగురిని గురుకులం నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

బైక్ పైనుంచి పడి యువకుడి మృతి

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపేట ఎక్స్ రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడి నూర శేఖర్(32) అనే యువకుడు మృతి చెందాడని ఎస్సై సతీష్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మందమర్రి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన శేఖర్ ఈనెల 16వ తేదీన కడెం మండలంలో తన బంధువులు చనిపోవడంతో అంత్యక్రియలకు హాజరయ్యాడు. తిరిగి వస్తుండగా వెంకట్రావుపేట ఎక్స్ రోడ్డు వద్ద అడవి పంది అడ్డురావడంతో దాన్ని తప్పించబోయి కిందపడ్డాడు. దీంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనంలో మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు ఎస్సై-2 రామయ్య కేసుదర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలో 55 వేల ఉద్యోగాలు ఇచ్చాం

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

పెద్దపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇప్పటి వరకు 55 వేల ఉద్యోగాలు కల్పించామని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్ క్యాలెండర్ ప్రకటించామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. సోమవారం పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గస్థాయి పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. పెద్దపల్లి నియోజకవర్గ స్థాయి సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి ఈ ప్రాంతంలో విద్యాసంస్థలను నెలకొల్పి నాణ్యమైన విద్యను అందించాడని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యాసంస్కరణలను తీసుకువస్తున్న నేపథ్యంలో విద్యావేత్తల భాగస్వామ్యం నేపథ్యంలో నరేందర్‌రెడ్డిని బరిలో నిలిపామన్నారు. అభ్యర్థి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తనకు లభిస్తున్న ఆదరణనుచూసి ఓర్వలేక తనపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. పట్టభద్రులంతా కాంగ్రెస్ వైపే ఉన్నారని, తనకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాదరావు, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, మాజీఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ పాల్గొన్నారు.

ఎంవీటీసీ కేంద్రం పరిశీలన



గోలేటిలోని ఎంవీటీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి జీఎం రాజమల్లు

రెబ్బెన, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన గోలేటిలోని ఎంవీటీసీ కేంద్రాన్ని బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం రాజమల్లు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ హిత చర్యల్లో భాగంగా సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో త్వరలో కాగితరహిత సేవలకు శ్రీకారం చుడుతుందన్నారు. ఈవిషయంపై మంగళవారం శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈయన వెంట డీజీఎం (ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహర, ఎంవీటీసీ మేనేజర్ విజయ్‌సింగ్ ఇందా, పర్సనల్ మేనేజర్ రెడ్డి మల్ల తిరుపతి, ఐటీ ఇంచార్జి ముజీబ్, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆయుర్వేద వైద్య శిబిరం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : సింగరేణి ఆధ్వర్యంలో మంగళవారం ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు డీజీఎం (పర్సనల్) అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. నస్పూర్‌కాలనీలోని మనోరంజన్ సముదాయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందిస్తారని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పదేళ్ల కోసం ప్రణాళికలు సిద్ధం చేయండి

- సింగరేణి సీఎండీ ఎన్ బలరాం - జీఎంలు, పీవోలు, ఏజెంట్లతో ముఖాముఖి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సంస్థ అభివృద్ధికి రాబోయే పదేళ్ల కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అన్నారు. అన్ని ఏరియాల జీఎంలు, పీవోలు, ఏజెంట్లతో సోమవారం ఆయన హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బొగ్గు మార్కెట్‌లో పోటీ తీవ్రంగా ఉందని, దానిని అధిగమించేందుకు ఉత్పత్తి పెంపు, ఖర్చు తగ్గింపు చేయాలన్నారు. రానున్న రోజుల్లో లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా సాధించాలని సూచించారు. ప్రతి రోజూ 2.6 లక్షల టన్నుల బొగ్గు వెలికితీయాలని, 17 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెను తొలగించాలన్నారు. సూచించారు. రక్షణ, నాణ్యతకు పెద్దపీట వేయాలని సూచించారు. ఉత్పత్తి చేసిన బొగ్గును సకాలంలో వినియోగదారులకు అందించాలన్నారు. నూతన ఉపరితల గనుల విషయంలో అపరిష్కృతంగా ఉన్న భూసేకరణ, పర్యావరణ అనుమతులపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఇటీవల తాను 20 గనుల్లో క్షేత్రస్థాయి పర్యటన చేసిన సందర్భంలో ఉద్యోగులు పలు సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చారని, వాటిని తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. గనుల్లో 8 గంటల విధులను తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. మస్టర్ పడి బయటికి వెళ్లే వారిపై కఠినచర్యలు చేపట్టాలని చెప్పారు. సమావేశంలో డైరెక్టర్లు డి సత్యనారాయణ (ఈఅండ్ఎం), ఎల్‌వి సూర్యనారాయణ(ఆపరేషన్స్), కె. వెంకటేశ్వర్లు(పీఅండ్‌పీ), అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

శ్రీరాంపూర్ ఏరియా జీఎంగా శ్రీనివాస్

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జీఎంగా ఎం శ్రీనివాస్ నియమితుల య్యారు. ఈ మేరకు యాజమాన్యం సోమవారం సాయం త్రం ఉత్తర్వు లు జారీ చేసింది.

ఆయన ప్రస్తుతం బెల్లంపల్లి ఏరియా జీఎంగా పనిచే స్తున్నారు. అలాగే బెల్లంపల్లి ఏరియా జీఎంగా కార్పొరేట్ (సీఎంసీ)లో జీఎంగా పనిచేస్తున్న ఎం విజయభా స్కర్‌రెడ్డిని యాజమాన్యం నియమించింది.



ఎం శ్రీనివాస్

- అదనపు జీఎంలకు పదోన్నతి

కార్పొరేట్ (ఆర్ అండ్ డీ)లో అదనపు జీఎంగా పనిచేస్తున్న మేకల కనకయ్య కొత్తగూడెం రీజియన్ జీఎం(క్వాలిటీ మేనేజ్ మెంట్)గా, ఆర్‌జీ-3 ఏరియాలో అదనపు జీఎంగా పనిచేస్తున్న కొలిపాక నాగేశ్వర్‌రావు అడ్రియాల ప్రాజెక్ట్ జీఎంగా, మందమర్రి ఏరియాలో అదనపు జీఎంగా పనిచేస్తున్న వి రామదాసు కార్పొరే ట్‌లో జీఎం(బీడీ)గా, జీడీకే ఓసీపీ-3లో అదనపు జీఎంగా పనిచే స్తున్న ఎస్ మధుసూదన్ కార్పొరేట్‌లో జీఎం(సీఎంసీ)గా పదోన్న తులు పొందారు.

సింగరేణి సమాచారం

ఎస్‌టీపీపీ ఈడీ బదిలీ

జైపూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) సింగరేణ థర్మల్ విద్యుత్ కేంద్రం ఎక్స్‌క్యూటీవ్ డైరెక్టర్ (ఈఅండ్ఎం)గా పనిచేస్తున్న ఎస్వీ రాజశేఖర్‌రావును సోమవారం బదిలీ చేశారు. కార్పోరేట్ కార్యాలయంలోని మార్కెటింగ్ జీఎంగా బదిలీ చేస్తూ సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది.

కాంట్రాక్టు కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటం

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం తమ యూనియన్ ఎనలేని పోరాటాలు చేస్తుందని సీఐటీయూ అనుబంధ కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మందమర్రి ఏరియాలోని పలువురు కాంట్రాక్టు కార్మికులు యూనియన్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా కాంట్రాక్టు కార్మికుల సమస్యలు తీరడం లేదన్నారు. వెట్టి చాకిరీలో మగ్గుతూ శ్రమ దోపిడికి గురవుతున్న కాంట్రాక్టు కార్మికుల పట్ల పాలక వర్గాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు తమ యూనియన్ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్, నాయకులు సంకె రవి, వెంకటస్వామి, కుమార్, శ్రీనివాస్, రాజేశం, చంటి, వెంకటేష్, ఇమామ్, శ్రీనివాస్, సందీప్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



యూనియన్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న శ్రీనివాస్

ఎమ్మెల్యే పూజలు..



బెల్లంపల్లిరూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కన్నాల గ్రామ పంచాయతీలోని బుగ్గ రాజరాజేశ్వరి స్వామి ఆలయంలో సోమవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన ట్రస్టు చైర్మన్ శ్రీదేవిశ్రీరాములు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ శ్వేత, రాంచందర్, అనిత పాల్గొన్నారు.

చెరువుల పరిశీలన..



తాండూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంపలపల్లి, ద్వారకాపూర్ గ్రామాల్లోని చెరువులను సోమవారం అధికారులు పరిశీలించారు. గత వర్షాకాలంలో చెరువులకు బుంగల పడగా వాటి మరమ్మతుల ఎస్టిమేషన్ కోసం ఉన్నతాధికారులకు పంపిస్తామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాము, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నవీన్‌కుమార్ తెలిపారు.

అభివృద్ధి పనులు..



మందమర్రిటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 15 వార్డు దీపక్‌నగర్‌లో ప్రభుత్వ నిధులతో చేపడుతున్న కల్వర్టు పనులను సోమవారం మున్సిపల్ కమిషనర్ రాజలింగు పరిశీలించారు. పనులను నాణ్యతతో చేయాలని సూచించారు. ఆయన వెంట డీఈ సుమతి తదితరులు ఉన్నారు.

పాఠశాలకు బ్యాండ్..



దండేపల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వుల్ల సత్తమ్మ జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు సోమవారం బ్యాండ్‌ను అందజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, దాతలు సత్తన్న, ఏఏపీపీ చైర్మన్ లక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజశేఖర్, అనిత, సల్మ ఉన్నారు.

అందుబాటులోకి ఏసీబీ ఆఫీస్..

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ ఆసుపత్రి సివిల్ సర్జన్ డాక్టర్ రవీంధర్‌నాయక్‌ను ఏసీబీ అధికారులు రూ. 6వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. దండేపల్లి మండలం లక్ష్మీకాంతాపూర్‌కు చెందిన రైతు తొడం కిషన్‌కు మెడికల్ సర్టిఫికేట్ ఇచ్చేందుకు రూ. 6వేలు లంచం తీసుకుంటూ వైద్యుడు ఏసీబీకి పట్టుబడ్డాడు. మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తుమ్మల లింగమూర్తి తోటి ఉద్యోగివద్ద రూ. 4వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. దీపావళి పండుగను పురష్కరించుకొని మంచిర్యాలలో టపాకాయల వ్యాపారులవద్ద డబ్బులు డిమాండ్ చేసిన పలు ప్రభుత్వ కార్యాలయాల అధికారులు, సిబ్బందిపై ఏసీబీ అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇందులో అగ్నిమాపకశాఖ, పోలీస్, మున్సిపల్, ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, విద్యుత్‌శాఖకు చెందిన పలువురు అధికారులు, కిందిస్థాయి సిబ్బంది ఉండటం గమనార్హం. ఒకే ఘటనలో ఏకంగా ఆరు ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన సిబ్బంది కేసుల్లో ఇరుక్కోవడం జిల్లాలోనే ప్రథమంగా చెప్పుకోవచ్చు. అలాగే మంచిర్యాల నీటి పారుదలశాఖ అధికారులు శుక్రవారం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుపడ్డారు. జిల్లా లోని జైపూర్ మండలం మిషన్ కాకతీయలో భాగంగా ఐదు చెరువులకు సంబంధించిన బిల్లులు ఇచ్చేందుకు మంచిర్యాల నీటిపారుదల శాఖకు చెందిన డీఈ బాలసిద్ధూ, ఈఈ వినోద్ కుమార్‌లు లంచం జైపూర్ మండలంలోని దాంపూర్ ఊరచెరువు, పెగడపెల్లి, మద్దికుంట, ఆరెపల్లి, మద్దికల్ చెరువులను మిషన్ కాకతీయ పనులకు సంబంధించి బిల్లుల మంజూరు కోసం కాంట్రాక్టర్ రవీంధర్ నుంచి రూ. లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఇవిగాక జిల్లాలో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన ఘటనలు అనేకం ఉన్నాయి.

ముగిసిన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

గర్మిళ్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 3 నుంచి నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రాక్టీకల్ పరీక్షలు సోమవారంతో ముగిశాయి. 39 సెంటర్లలో ఈ నెల 3 నుంచి 17 వరకు మూడు విడతలుగా పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అంజయ్య తెలిపారు. గైర్హాజరైన విద్యార్థులకు నేటి నుంచి 22 వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలో ప్రత్యేకగా పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

మందమర్రిలో రాష్ట్రస్థాయి యోగా పోటీలు

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో ఈ నెల 23న డ్రీమ్ యోగా అండ్ ఫిట్‌నెస్ సొసైటి ఆధ్వర్యంలో తెలంగాణ యోగా కప్ పోటీలను నిర్వహిస్తున్న సొసైటీ వ్యవస్థాపకులు ముల్కల శంకర్ తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వయస్సు కాంపిటేషన్ గ్రాండ్ చాంపియన్ షిప్ ఉంటాయని, సూర్య నమస్కారాలు, యోగా పుత్రిక, యోగా విన్యాస పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి 400 మంది పాల్గొననున్నారని, 70 మందియోగా గురువులు పాల్గొనున్నట్లు తెలిపారు. పాల్గొనే వారికి సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

ఇందుకు సంబంధించి ప్రచారం చేస్తున్నాయన్నారు. యోగా సభ్యులు మద్ది శంకర్, అనిల్ కుమార్, దామోదర్, కుమార్, సాంబయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.



దట్టమైన అటవీ ప్రాంతంలో ఊట్ల గిరిజన గ్రామం

ఊట్ల గిరిజనుల.. పాట్లు తప్పేనా



దండేపల్లికి ఎడ్ల బండిపై వస్తున్న గిరిజనులు

- కిలో మీటర్ల పొడువున రాళ్లు తేలిన గిరిజన గ్రామ రహదారి
- పట్టించుకోని ప్రభుత్వం..
- ఇబ్బందుల్లో ఆదివాసీలు

దండేపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్ని ప్రభుత్వాలు మారినా ఊట్ల గిరిజన గ్రామస్థుల బతుకులు మాత్రం మారడం లేదు. ఏళ్లుగా గిరిజ నుల తలరాతలు మారక కనీసం సరైన రహదారి లేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. దట్టమైన ఆటవీ ప్రాంతంలో ఉన్న ఊట్ల గిరిజన గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా రాళ్లు తేలి శిధిలావస్థకు చేరింది. దీంతో అభివృద్ధికి ఆమడ దూరంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ రోడ్డు గుండా ప్రయాణం చేయాలంటే నరకయాతన అనుభవించాల్సిన పరిస్థితి నెలకొంది. దండేపల్లి మండలం మామిడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఊట్ల ఆదివాసీ గిరిజన గ్రామం ఉంది. ఇక్కడ దాదాపు 30 కుటుంబాలు నివసిస్తున్నాయి. దండేపల్లి మండల కేంద్రం నుంచి సుమారు ఏడు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఊట్ల గ్రా మానికి వేళ్లేందుకు నాలుగు కిలో మీటర్ల మేర మెటల్ రోడ్డు ఉంది. ఈ రోడ్డు మొత్తం రాళ్లు తేలి ఉండటంతో వాహనదారులు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


గతంలో బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ, అటవీశాఖ అనుమతులు ఇవ్వ లేదని సమాచారం. దీంతో రోడ్డు నిర్మాణం ఆగిపోయింది. కేవలం సంబంధిత కాంట్రా క్టర్ దండేపల్లి నుంచి ఫారెస్టు ఎంట్రెన్సీ వరకు మాత్ర మే బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. మిగతా అంతా అడవి ఉండటంతో అక్కడ నుంచి మొత్తం మెటల్ రోడ్డు చేపట్టారు. చేపట్టిన మెటల్ రోడ్డు ఇప్పుడు రాళ్లు తేలి పెద్ద పెద్ద గుంతలు పడటంతో, ఊట్ల గిరిజనులు తమ రాకపోకలు సాగించేందుకు అనేక అవస్థలు పడుతున్నారు. బీటీ రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతుల గురించి పాలకులు, అధికారులు ఎవరు ఏ మాత్రం పట్టించుకోలేదని, కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే తాము గుర్తుకు వస్తామని వాపోతున్నారు.

పెద్దయ్య దేవుడి భక్తులకు ఇబ్బందే...

ఊట్ల గిరిజన గ్రామ ప్రజలతో పాటు దట్టమైన అట వీ ప్రాంతంలో పెద్దయ్య దేవుడి ఆలయం ఉంది. పెద్ద య్య ఆలయానికి ప్రతి ఆది, గురువారాలలో మన జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి ఎక్కువగా భక్తులు, రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈ రహదారి కష్టాలు పెద్దయ్య దేవుడి భక్తులకు తప్పడం లేదు. దీనికి తోడు కోమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం గుండాల గిరిజన గ్రామంలో గుండాల జలపాతం కూడా ఉంది. దండేపల్లి మండల కేంద్రం నుంచి గుండాల జలపాతం వరకు సుమారు 18 కిలో మీటర్లు ఉంటుంది. జలపాతానికి వేళ్లేందుకు ఈదే రోడ్డు మార్గం కావడంతో గుండాల జలపాత పర్యాటకులకు కూడా ఈరోడ్డు కష్టాలు తప్పడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైన స్పందించి ఊట్ల గిరిజన గ్రామం వరకు బీటి రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ నుంచి అనుమతి ఇచ్చే విధంగా పాలకులు, అధికారులు చర్యలు చేపట్టి బీటీ రోడ్డు నిర్మాణం చేట్టాలని కోరుతున్నారు.

గ్రామం వరకు డాంబర్ రోడ్డు వేయాలి


ఏర్రయ్య, ఊట్ల గిరిజనుడు



దట్టమైన అటవీ ప్రాంతంలో నివా సించే తమ ఆదివాసి గూడమైన ఊట్ల గిరిజన గ్రామం వరకు డాం బర్ (బీటి) రోడ్డు నిర్మించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. గతంలో వేసిన మెటల్ రోడ్డు పాడై కంకర తేలింది. నడవడానికి ఇబ్బందికరంగా ఉన్నా ఎవరు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం స్పందించి ఫారెస్ట్ నుంచి అను మతి ఇప్పించి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు.

ప్రయాణం కష్టంగా ఉంది

మెతే రజిత, ఊట్ల గ్రామం



అటవీ ప్రాంతం ఎంట్రెన్సీ నుంచి ఊట్ల గిరిజన గ్రామం వరకు సుమారు 4కిలో మీటర్లు పొడవున మెటల్ రోడ్డంత రాళ్లు తేలింది. ఈ రోడ్డుపై ప్రయాణం కష్టంగా ఉంది. ఏళ్లుగా మా గూడేనికి రోడ్డు సరిగా లేదని ఎన్నిసార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో నాయకులు వచ్చి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి వెళ్లిపోతారే తప్ప పట్టించుకోరు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

జన్నారం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జన్నారం మండలంలో ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లతో పాటు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాందాస్ నాయక్, జిల్లా అధ్యక్షుడు రింగుల ఎల్లయ్య పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు పేదలతో కలిసి నిరసన తెలిపారు. తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డికి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఇండ్లులేని నిరుపేదలు అద్దె ఇండ్లలో ఉంటూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్థలాలను ఇవ్వడంతో పాటు ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిసన్‌నర్సయ్య, గోపి, చంద్రయ్య, ధర్ము, కైలాష్, సంధ్య, వెంకటాద్రి పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టు పోస్టర్ల విడుదల

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : యుఎస్ ఎఫ్ఐ ఆధ్వర్యంలో మార్చి 2, 3, 4, 5 తేదీల్లో నిర్వహించే పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టు పోస్టర్లను సోమవారం డీఈవో యాదయ్య విడుదల చేశారు. ఈ టాలెంట్ టెస్టులో పదవ తరగతి విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్లు చౌదరి, సత్యనారాయ ణ మూర్తి, రామ న్నన రాజ్‌కుమార్, కుమారస్వామి, యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య హక్కుల సాధన కోసం కృషి

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్యుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం ఆర్యవైశ్య మహాసభ పనిచేస్తుందని మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన మహాసభ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మంచిర్యాల జిల్లా నాయకులు ఆయ నను కలిశారు. ఆయన మాట్లాడుతూ త్వరలోనే ప్రభుత్వానికి ఆర్యవైశ్యుల ప్రధాన డిమాండ్లను విన్నవించబోతు న్నామని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ముక్త శ్రీనివాస్, జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, మందమర్రి పట్టణాధ్యక్షుడు రావికంటి వెంకటేశ్వర్లు ఉన్నారు.

నేడు బుగ్గ దుకాణాల వేలం

బెల్లంపల్లిరూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 18న దుకాణాల ఏర్పాటుకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు వేలం పాట ప్రారంభమవుతుందన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ. 20 చెల్లించాలని సూచించారు.

ముత్యంపల్లిలో తాగునీటికి కటకట

కాసిపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఆరంభానికి ముందే ముత్యంపల్లిలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముత్యంపల్లి పంచాయతీ మసీదు సమీపంలోని చేతి పంపు చెడి పోయి నెల రోజులు కావస్తుంది. అలాగే మిషన్ భగీరథ నీరు కూడా రావడం లేదు. వచ్చిన నీరు మురికిగా రావడంతో రోగాల బారిన పడుతున్నామని పేర్కొంటున్నారు. చేతి పంపు మరమ్మత్తులు చేయినా అధికారులకు చెప్పినా పట్టించు కోవడం లేదన్నారు. రోజు ఖాళీ బిందెలు చేతి పంపు వద్ద పెట్టి నిరసన తెలుపుతున్నారు. అధికారులు చేతి పంపు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

సదర్గాగా ఉస్మాన్‌ఖాన్

దండేపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం తాళ్లపేట జామా మసీదు సదర్గాగా సోమవారం ఉస్మాన్‌ఖాన్ నియమితులయ్యారు. కొద్ది రోజుల క్రితం రెగ్యులర్ సదర్గా మృతి చెందడంతో ఈయన ఇన్‌చార్జిగా ఉన్నారు. కమిటీ సభ్యుల నిర్ణయం మేరకు రెగ్యులర్ సదర్గాగా ఎన్నుకోవడంతో సీనియర్ పాత్రికేయుడు ముస్తఫాతో పాటు రహీం, ఫజియోద్దీన్, కమిటీ సభ్యులు ఆయన్ను అభినందించారు.

ఘనంగా కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు



బెల్లంపల్లిలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య



మంచిర్యాలలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలను సోమవారం మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. నాయకులు సుదర్శన్, కొమ్మెర లక్ష్మణ్, సుభాష్‌రావు పాల్గొన్నారు.

చెన్నూరు : చెన్నూరు పట్టణం, మండలంలో బీఆర్ఎస్ నాయకులు రాజారమేష్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. కొత్త బస్టాండ్ ప్రాంతంలో 71 కిలోల కేక్‌ను కట్ చేశారు.

గర్మిళ్ల: మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు నివాసంలో కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు విజిత్‌రావు, సత్యం, రాజయ్య, రవీందర్, సరోజ, సత్యనారాయణ పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: పట్టణంలోని ఐబీలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య, పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్ రాజన్న పాల్గొన్నారు.

కాసిపేట : కాసిపేటలో బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు అందజేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ క్రీడా మైదానం పరిసరాల్లో మొక్కలు నాటారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ మంజుల రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వేమనపల్లి : వేమనపల్లిలో కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కోలి వేణుమాధవ్‌రావు, నాయకులు వెంకటేశం, మధుకర్, లక్ష్మీకాంత్, పాల్గొన్నారు.

దండేపల్లి: దండేపల్లిలో ప్రభుత్వ బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులతో పాటు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పీఏసీఎస్ చైర్మ న్ కాసనగొట్టు లింగన్న, మాజీవైస్ ఎంపీపీ పసర్తి అనిల్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అక్కల రవీందర్, మాజీ ఉప సర్పంచు భూమన్న పాల్గొన్నారు.

జైపూర్ : మండల కేంద్రంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. బీఆర్ఎస్ నాయకులు మేడి తిరుపతి, పెద్దపల్లి రమేష్, రవి, పాల్గొన్నారు.

జైపూర్ : మండల కేంద్రంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. బీఆర్ఎస్ నాయకులు మేడి తిరుపతి, పెద్దపల్లి రమేష్, బడుగు రవి, సాగర్‌రెడ్డి, సాయికృష్ణ, పూదరి మల్లేష్ పాల్గొన్నారు.

నెన్నెల : మండల కో ఆప్షన్ సభ్యుడు ఎండీ ఇబ్రహీం కేక్ కట్ చేసి సంబరాలను ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు రాంసాగర్, సింగతి సత్తెన్న, కృష్ణస్వామి, మోబీన్‌షరీఫ్, ప్రవీణ్‌యావ్, ఆశయ్య, బాబులాల్, సర్వర్‌పాష పాల్గొన్నారు.

జన్నారం : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పె ట్టారు. మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు రాజారాంరెడ్డి, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

కోటపల్లి : చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పిలుపుమేరకు సర్వాయిపేట గ్రామంలో వృక్షార్చనలో భాగంగా మొక్కలు నాటారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులు బాపునాయక్, గుగులోత్ చందునాయక్, దుర్గం రాజమల్లుల ఆధ్వర్యంలో పలువురు మొక్కలు నాటారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.



చెన్నూర్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. నాయకులు ఎండీ లాలా, స్వామి, గొర్ల సంతోష్, బుద్ది ప్రసాద్, వెంకటిరెడ్డి, పాల్గొన్నారు.

తాండూర్ : తాండూర్‌లోని సేవా జ్యోతి శరణాలయంలో కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రణయ్‌కుమార్, గట్టు సంతోష్, బోడ సతీష్, శంకర్, క్రిష్ణపర్, పోచం, విజయ్, ప్రదీప్‌రావు పాల్గొన్నారు.

భీమిని : మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో . బెల్లంపల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బోనగిరి నిరంజన్ గుప్తా ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. మాజీ కోఆ ప్షన్ సభ్యుడు ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నెపల్లి : కన్నెపల్లి మండల కేంద్రంలో కేక్ కట్ చేశారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కౌటారపు సత్యనారాయణ, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : సారంగపల్లిలోని తుర్కపల్లిలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేల్పుల రవి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు నసీరొద్దీన్, నాయకులు ఫిరోజ్ పాల్గొన్నారు.

●రామకృష్ణపూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని వినతి

జన్నారం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీల్లో గత ఆగస్టు నెల నుంచి పెండింగ్‌లో ఉన్న చెక్కుల చెల్లింపులు, గ్రామపంచాయతీల నిర్వహణకు నిధులను విడుదల చేయాలని కోరుతూ మండల కార్యదర్శుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో ఉమర్ షరీప్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ మండల అధ్యక్షుడు లకావత్ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో గత సంవత్సరం పాలక వర్గం కాల పరిమితి ముగిసిన నాటి నుంచి గ్రామపంచాయతీల్లో రోజు నిర్వహణ అయిన పారి శుధ్యం నిర్వహణకు కావాల్సిన ట్రాక్టర్ డీజీల్, మరమ్మతులు, బ్లీచింగ్, బయోటెక్స్ ఫాగింగ్ దోమల మందులు, వీధి దీపాల నిర్వహణను అప్పులు తీసుకువచ్చి నిర్వహించామన్నారు. వెంటనే నిధులు, బిల్లులను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జలందర్, కా ర్యదర్శులు విశ్వశ్రీ, మధుకర్ పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' విజయవంతం చేయాలి

ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్



పోస్టర్లు విడుదల చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

నెన్నెల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఆరు గ్యారంటీల అమలు, ప్రజాస్వామిక హక్కుల పునరుద్ధరణ కోసం డిమాండ్ చేస్తూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 20న చేపట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని గుండ్లసోమారంలో సోమవారం పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఎన్నికల మెనిఫేస్టోలో కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చి గద్దెను ఎక్కిందని, ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్న ఒకటి రెండు తప్ప మిగతావి అమలు కాలేదన్నారు. రైతుభరోసా, రుణమాఫీ పూర్తిగా అర్హులందరికి ఇవ్వలేదని, ఇందిరమ్మ ఇళ్ల ఊసే లేదన్నారు. పోడు భూములకు పట్టాలు రాలేదన్నారు. నిరుద్యోగులకు అందిచే భృతిని విస్మరించారని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 20న తలపెట్టిన ప్రజాప్రదర్శన, బహిరంగ సభలకు ప్రజాస్వామిక వాదులు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి రత్నం తిరుపతి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు చరణ్, నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల
జిల్లా వార్తలు

5

మంగళవారం 18 ఫిబ్రవరి 2025



అందుబాటులోకి ఏసీబీ ఆఫీస్

- జిల్లా కేంద్రంలో త్వరలో ఏర్పాటు
- ప్రభుత్వ కార్యాలయాల్లో పెరిగిపోతున్న అక్రమార్కులు..!
- ఏసీబీని ఆశ్రయిస్తున్న బాధితులు

మంచిర్యాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు ఏసీబీ కార్యాలయం మరింత చేరువ కానుంది. కార్యాలయాన్ని త్వరలో జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనుండడంతో అక్రమార్కుల్లో ఆందోళన మొదలైంది. జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాలు రోజురోజుకూ మితి మీరిపోతున్నాయి. ప్రతీ పనికీ కొంత వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అసలు ముడుపులు చెల్లించనిదే ఫైళ్లు ముందుకు కదలడం లేదనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారుల కనుసన్నల్లోనే ఈ వ్యవహారం జరుగుతుండగా ప్రజలు, వినియోగదారులు కార్యాలయానికి వెళ్లి ముడుపులు చెల్లించుకోక తప్పడం లేదు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా ఏసీబీ కార్యాలయాన్ని తెరిచేందుకు ఆ శాఖ ఉన్నతాధికారులు సన్నద్ధం అవుతున్నారు.

జిల్లా కేంద్రంలోనే..!

ప్రస్తుతం ఏసీబీ కార్యాలయం ఆదిలాబాద్‌లో ఉంది. ఆదిలాబాద్ ప్రధాన కేంద్రంగా ఉమ్మడి జిల్లాలోని కుమురంభీం, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్ నుంచి పర్యవేక్షణ జరుగుతోంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై దాడులు చేయాలంటే ఆదిలాబాద్ నుంచి సుమారు 300 కిలో మీటర్ల మేర ప్రయాణం చేయాల్సి వస్తోంది. దీంతో కార్యాలయాన్ని మంచిర్యాలలో ఏర్పాటు చేయా లనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. జిల్లా కేం ద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న మహిళా పోలీస్ స్టేషన్‌లోనే ఏసీబీ కార్యాలయాన్ని ప్రారంభిం చేందుకు దాదాపుగా ఏర్పాట్లు పూర్తయినట్లు తెలు స్తోంది. గరిష్ఠంగా 15 రోజుల్లోగా ఏసీబీ కార్యా లయం ఏర్పాటు అయ్యే అవకాశాలు ఉన్నాయి. దీం తో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. మంచిర్యాలలోనే ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేయడం ద్వారా ఇక్కడి నుంచే కార్యకలాపాలు కొనసాగించే యోచనలో సంబంధిత అధికారులు ఉన్నారు.

జిల్లాలో పలు ఘటనలు..

లంచం తీసుకుంటున్న అవినీతి అధికారులను ఏసీబీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న పలు సంఘటన లు జిల్లాలో కోకొల్లలుగా ఉన్నాయి. దండేపల్లి మండలంలోని రెబ్బెనపల్లి అప్పటి వీఆర్‌వో ఎండీ ఇలియాజ్, నంబాలకు చెందిన గోపతి శ్రీనివాస్ అనే రైతు నుంచి 1.17 ఎకరాల భూమిని విరాసత్ చేసేందుకు రూ.3వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వీఆర్‌వోను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మంచిర్యాల పట్టణంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి అప్పటి కాసిపేట తహసీల్దార్ అలుగునూరి రోశయ్యను రూ.10వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. లక్సెట్టిపేట మండలంలోని మోదెల వీఆర్‌వో రత్నయ్య ప్రభుత్వ ఉపాధ్యాయుని వద్ద రూ.4వేలు లంచం తీసుకుంటుండగా కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ సుదర్శన్, అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అప్పటి భీమిని ఎంఈవో గంగాసింగ్ సైతం బెల్లంపల్లి పట్టణంలో సాక్షర భారత్ విలేజ్ కోఆర్డినేటర్ పద్మ నుంచి రూ.4వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. లక్సెట్టిపేట మండల కేంద్రంలోని..

(తరువాయి 7లో..)

మూతపడ్డ 'సీఎఫ్‌సీ'



వాంకిడిలోని కామన్ ఫెసిలిటీ సెంటర్

- ప్రభుత్వ ఆర్డర్లు లేక కార్మికులకు ఉపాధి కరువు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- ఆందోళనలో కార్మికులు

6

ఊట్ల గిరిజనుల.. పాట్లు తప్పేనా



శిథిలమైన ఊట్లకు వెళ్లే గిరిజన ఆటవీ ప్రాంత రోడ్డు

- కిలో మీటర్ల పొడువున రాళ్లు తేలిన గిరిజన గ్రామ రహదారి
- పట్టించుకోని ప్రభుత్వం..
- ఇబ్బందుల్లో ఆదివాసీలు

7

ఉద్యోగావకాశాలు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆం ధ్రజ్యోతి) : జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న యువతీ, యువకులు ఉద్యోగాలకోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పదవ తరగతి నుంచి డిగ్రీ ఆపై చదు వుకున్న వారు అర్హులని తెలిపారు. ఇంగ్లీష్, హిందీ భాషల్లో ప్రావీణ్యం, నైపుణ్యం కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. 20న ఉదయం 9 గంటలకు మంచిర్యాలలోని వివే కవర్ధిని డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాల కోసం 630320 4295లో సంప్రదించాలన్నారు.

ఆటో కార్మికులకు జీవన భృతిని అందజేయాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆటో నాయకులు

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకం ద్వారా ఆటోల్లోని ప్రయాణీకుల సంఖ్య తగ్గిందని, దీంతో ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 12 వేలు చెల్లించాలని కోరుతూ ఆటో కార్మిక సేవా సమి తిఫౌండేషన్ నాయకులు సోమవారం రాత్రి చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెం కటస్వామికి మంచిర్యాలలోని ఆయన నివాసంలో వినతిపత్రం అందించారు. చాలా మంది ఆటో డ్రైవర్లు గిరాకీలు లేక ఆటోలు నడపలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. అలాగే ఫైనాన్స్‌లు కట్టలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు ఉన్నాయన్నారు. ప్రతి నెల ఆటో డ్రైవర్లకు రూ. 12 వేలు ఇచ్చేలా ప్రభుత్వంతో మాట్లాడాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, లచ్చన్న, రవి, శ్రీనివాస్, కొమురయ్య, అంజి పాల్గొన్నారు.

ముందుకు సాగని బీటీ రోడ్డు పనులు

- కంకర రోడ్డుపై గిరిజన రైతుల నరకయాతన
- పట్టించుకోని అధికారులు

దండేపల్లి, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం మామిడిపల్లి నుంచి కంచారబాయి గిరిజన గ్రామం వరకు రూ. కోటికిపైగా నిధులతో చేపట్టే బీటి రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. బీటి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి ఏడాది దాటిన ఇంకా అసంపూర్తిగానే మిగిలి పోయింది.

సంబంధిత కాంట్రాక్టర్ కంకర రోడ్డుపై పోసి వదిలివేశారే తప్ప బీటి రోడ్డు నిర్మాణం చేపటలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో కంచయాబాయి గిరిజ నులతో పాటు మామిడిపల్లి, కొత్త మామిడిపల్లి గ్రామాల రైతులు ఈ కంకర రోడ్డు గుండా వేళ్లా లంటే రైతులు, గిరిజనులు నరకయాతన అనుభ విస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు స్పందించి కంకర రోడ్డుపై బీటి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి తమ కష్టాలను తీర్చాలని గిరిజనులు, రైతులు కోరుతున్నారు.



కడెం ప్రధాన కాలువ పక్క కంచారబాయి వెళ్లే రోడ్డులో వదిలేసిన కంకర

భరోసా కేంద్రాన్ని సందర్శించిన సీపీ

- బాధితులకు సహాయం అందించాలని సూచన

నస్పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : నస్పూ ర్‌లోని పాత పోలీస్ స్టేషన్ భవనంలో ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ సోమవారం సందర్శించారు. కేంద్రంనిర్వహణ, కేసులవివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాధితులను అక్కున చేర్చుకోవాలని, తక్షణమేవారికి సూచనలు, సలహాలు, సహాయం అందించాలని సూచిం చారు. లీగల్, మెడికల్, చిన్నారుల కౌన్సిలింగ్ గదులు, స్టేట్‌మెంట్ రికార్డు సమావేశం గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే కేసు ల్లో బాదితులకు తక్షణమే న్యాయం సహాయం అందే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించడం వంటి సేవలు అందించి బాధితులకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. బాధితులకు న్యాయపరమైన సూచనలు అందించి వారికి ఏవరూ లేనప్పుడు భరోసా కేంద్రంలోనే ఆశ్రయం కల్పించాలన్నారు. అంతే కాకుండా కేంద్రంలోనే బాధితు లకు నైపుణ్యాలను నేర్పించి సమాజంలో ఉన్నతంగా జీవించేలా దోహదపడు తున్నయన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, అడిషినల్ డీసీపీ (అడ్మిన్) సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, మహిళా పోలీ స్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్ కుమార్, రూరల్ సీఐ ఆకుల అశోక్, షీ టీమ్ ఇన్‌చార్జి హైమా, సీసీ హరీష్, స్థానిక ఎస్సై నెల్కి సుగుణాకర్‌లతో పా టు సిబ్బంది పాల్గొన్నారు.



నస్పూర్‌లోని భరోసా కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్, పక్కన డీసీపీ భాస్కర్

ఆసుపత్రి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

గర్మిళ్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణం లోని ఐబీ చౌరస్తాలో నూతనంగా నిర్మిస్తున్న మాతా శిశు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను సోమవారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు పరిశీలించారు. నాణ్యతతో పనులను చేపట్టాలని, వేగంగా పనులను పూర్తి చేయాలన్నారు. అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మ న్ నల్ల మహేష్, పట్టణాధ్యక్షుడు తూముల నరేష్, పూదరి తిరుపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాప్రస్థాన నిర్మాణ పనులు పరిశీలన

గర్మిళ్ల : మంచిర్యాల పట్టణంలోని గోదావరి తీరంలో నిర్మిస్తున్న మహాప్రస్థాన నిర్మాణ పనులను సోమవారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు పరిశీ లించారు. నాణ్యతతో పనులను చేయాలని సూచించారు. శివరాత్రి వరకు పను లను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నల్ల మహేష్, మాజీ కౌన్సిలర్‌లు, పట్టణాధ్యక్షుడు తూ ముల నరేష్, పూదరి తిరుపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న కంటి వైద్య నిపుణులు

గర్మిళ్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, ప్రభుత్వ ఆసుపత్రి సంచాలకులు హరిశ్చంద్రరెడ్డి, జిల్లా కంటి వైద్యాధికారి యశ్వంతరావులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి మార్చి 5 వరకు ప్రభుత్వ పాఠశాలల విద్యా ర్థులకు కంటి పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని 8 ఆర్‌బీఎస్‌కే అంబులెన్స్‌ల ద్వారా రోజుకు 80 నుంచి 100 మంది పిల్లలకు కంటి పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. గతంలో నిర్వహించిన శిబిరంలో పరీక్షలు చేసిన విద్యార్థులకు 1274 మందికి తిరిగి పరీక్షలు చేసి కళ్లద్దాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. సోమవారం 86 మందికి పరీక్షలు చేయగా ఇద్దరిని శస్త్ర చికిత్సల కోసం రెఫర్ చేయడం జరిగిం దన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ అనిత, ఆర్‌ఎంవో భీష్మ, శ్రీధర్, వెంకటేశ్వర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయపు పన్ను చెల్లింపు ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్‌కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా లో సబ్‌రిజిస్ట్రార్‌తో పాటు, తహసీల్దార్ కార్యాలయాల్లో జరిగే లావాదేవీలకు సంబంధించి వచ్చే ఆదాయానికి పన్ను చెల్లింపు ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిజిస్ట్రేష న్ సమయంలో రూ.10 లక్షల కంటే ఎక్కువ మొత్తంలో లావా దేవీ జరిగే సమయంలో పాన్‌కార్డు సమర్పించని వారు ఫారం 60 జత చేయాలని, సంబంధిత రిజిస్ట్రార్, తహ సీల్దార్ ఫారం 61 ద్వారా వివరాలు నమోదు చేయాలన్నారు. పాన్‌కార్డు కలిగి ఉండి రూ.30లక్షల కంటే ఎక్కువ మొత్తంలో లావాదేవీ జరిగి నప్పుడు ఫారం61(ఏ) ద్వారా వివరాలు నమోదు చేయాల న్నారు. కార్యాలయాలకు సంబంధించి ఐటీ ఖాతా తెరిచేందుకు సంబంధిత కార్యాలయం టాన్ నెంబర్, చిరునామా, ఈమెయిల్ కార్యాలయం తరుపున అధికారిక వ్యక్తుల పాన్‌కార్డు నకలు ప్రతి జతపర్చాల్సిన ఉంటుందని తెలిపారు.


దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి చర్యలు

జిల్లాలోని దివ్యాంగులకు ఉపయోగపడేలా జిల్లా మహిళ, దివ్యాంగుల సంక్షేమశాఖ, అలింకో సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సహాయ ఉపకరాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు అర్హులైన వారిని ఎంపిక చేస్తామని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోనిమ్మినార్టీ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన దివ్యాంగులకు సహాయ ఉపకరాల పంపిణీ చేసేందుకు అర్హుల ఎంపిక కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. దివ్యాంగుల శాతం, అర్హతను బట్టి అవసరమైన సహాయ ఉపకరాలను దివ్యాంగులకు అందజేస్తామన్నారు.

వైభవంగా కొనసాగుతున్న విశ్వశాంతి మహాయాగం

తరలివస్తున్న భక్తజనం..ప్రత్యేక పూజలు

నస్పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలో నిర్వహిస్తున్న విశ్వశాంతి మహాయాగ మహోత్సవం వైభవంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం ఉదయం గోపూజ, తులసీపూజ, శ్రీ రుద్ర సహిత మృత్యుంజయ హోమాలు, రుద్రాభిషేకం, కుంకుమార్చన, విష్ణు సహస్రనామ, లలిత సహస్రనామ, సౌందర్యలహరి పారాయణ, హనుమాన్ చాలీసా పారా యణ, భజన, సహస్ర జ్యోతిర్లింగార్చన, రుద్రక్రమార్చనలు జరి గాయి. పూజల అనంతరం తీర్థ ప్రసాద వితరణ జరిగింది. జిల్లా లోని వివిధ ప్రాంతాలతో పాటు గోదావరి ఖని, పెద్దపల్లి ప్రాం తాల నుంచి కూడా భక్తులు వచ్చి హోమంలో పాల్గొంటున్నారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొని దర్శనం చేసుకుని వెళుతున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లను చేశామని పెర్కొ న్నారు. మహాయాగం సందర్భంగా విద్యుత్ కాంతులతో ఏర్పా టు చేసిన దేవుళ్ల చిత్ర పటాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెల కొంది. యాగశాలల ప్రాంగణంలో విద్యుత్ కాంతులతో ఏర్పాటు చేసిన వివిధ దేవుళ్ల చిత్రాలను ఆకట్టుకుంటున్నాయి.



విద్యుత్ కాంతులతో అయోధ్య రాముడు



హోమంలో పాల్గొన్న భక్తులు

బెల్లంపల్లి చెత్త వాహనాలను అడ్డుకున్న స్థానికులు

- దుబ్బగూడెం రోడ్డుపై బైఠాయించి నిరసన

కాసిపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో సేకరిం చిన చెత్తను కాసిపేట మండలంలోని సోమగూడెం 1వ గని సమీపంలో పడేయడాన్ని వచ్చిన చెత్త వాహనాలను సోమవారం దుబ్బగూడెం సమీపంలో స్థానికులు అడ్డుకున్నారు. వాహనాలకు అడ్డంగా రోడ్డుపై బైఠాయించారు. స్థానిక నాయకులు దుర్గం గోపాల్, సాపాట్ శంకర్, గోనెల శ్రీనివాస్ మాట్లాడుతూ కేకే ఓసీపీవల్ల సింగరేణి యాజమాన్యం కాసిపేట మండలంలో విధ్వంసం సృష్టించి ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేస్తుందన్నారు. ఇప్పుడు బెల్లంపల్లి మున్సిపాలిటీలో సేకరించిన చెత్తను కాసిపేట మండలంలో పడేయడం ఏమిటని ప్రశ్నించారు. చెత్తా, చెదారం, వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసనతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త కాల్చినప్పుడే వచ్చే పొగద్వారా గాలి కలుషితమై స్థానిక ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారినపడి ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. దీనిపై గతం లోనే చెప్పినా మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనాలకు అడ్డంగా బైఠాయించి నిర సన తెలపడంతో రెండు గంటల పాటు ఉద్రిక్తత నెలకొంది. కాసిపేట పోలీసులు సంఘటన స్థలా నికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. చెత్త వాహనాలను తిరిగి బెల్లంపల్లికి పంపించడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, మహిళలు పాల్గొన్నారు.



దుబ్బగూడెం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న స్థానికులు